


# చెత్త పరకలు

దీర్ఘాలోచనతో తల వొంచుకుని వెళ్తున్న నందయ్య, రోడ్డు మూల తిరగబోయి రక్కున నిలబడి, గిర్రున వెనక్కి తిరిగాడు.

దూరంగా – ఆ రోడ్డు వెంటే నడిచిపోతున్న కోటేశ్వర్రావూ, కామేశ్వర్రావూ అతని దృష్టికి యిట్టే తగిలారు. కామేశ్వర్రావు, మిత్రుడి వీపు గట్టిగా చరిచి రోడ్డు మధ్య నిలబడి మరీ, నవ్వుతున్నాడు.

నందయ్య గట్టిగా నాలుక కొరుక్కుని 'అంతే ఐవుంటుంది! అప్పట్లో ఆ మాటల అర్థం గ్రహించలేకపోయాడు. హుఁ' – అన్నాడు.

వుదయం మంచం దిగిన దగ్గిర నుంచీ, అన్నీ అపశకునాలే, అవమానాలే అతనికి ఎదురౌతున్నట్టు కనబడుతున్నయ్. గురువుగారి ఆరో కుమార్తె, తండ్రి మాట ధిక్కరించి వివాహం – అదీ వేదోక్తంగా – చేసుకునేంత నీచానికి వడికట్టిందని వార్త! తన భార్య సుగుణమణి నడుం వలయాన్ని పెంచుకుంటోందనీ, వచ్చి ఆ సంగతి ఏదో తెలుసుకుని కార్యం చేసుకోవడమో లేక ఆ సంబంధానికి నీళ్ళు వదలడమో చేయవలసిందనీ తల్లి కబురు! పెట్టెలో ఏమూలైనా సిబజాల్ బిళ్ల దొరుకుతుందేమో

అని తను వెతుకుతుంటే – అక్కడ ప్రశాంతంగా కాపురం చేస్తున్న ఓ కాళ్ళజెర్రి అణిచిపెట్టి పొడవటం! ఆ బాధ సాంతం పోయీపోకముందే, యింకా మణికట్టులో ఆ తీపూ, సలపరమూ అణిగిపోకుండానే ఆ కోటేశం ఆ రోడ్డు మీద ఎదురవడమూ –

నందయ్య మలుపు తిరిగి మళ్ళీ దీర్ఘాలోచనలో పడ్డాడు.

'నిజంగా ఆమాటల్లోవున్న అర్థం – గూడార్థం అదేనా?'

నందయ్య ఆ వాక్యాలని, పూటా రూపాయిని తిప్పితిప్పి చూసినంత జాగర్తగా, అనుమానంగా మనస్సులో మళ్లీ మళ్లీ కిందమీదు చేసి చూశాడు.

"ఈయన నా స్నేహితుడు. మీరు ఎరిగేవుంటారు – గొప్ప రచయిత – నందయ్య" – కోటేశ్వర్రావు తనను ఆ కొత్తవాడికి పరిచయం చేశాడు.

ఆ కొత్తవాడు కొంత పొగరుబోతుగా, తలబిరుసు రాయుడుగా కనబడ్డాడు.

"నందయ్యా! నేనెప్పుడూ ఆ పేరుగల రచయిత పేరు వినలేదే! మీరు ఏ పత్రికల్లో రాస్తుంటారు?"

తనకు ఆ మాటల్లో కొంత యీసడింపూ, తేలికదనం వున్నట్లు తోచింది.

"నేను అన్ని పత్రికలకూ రాయను. అందరికీ నా రచనల్ని ప్రకటించగలిగినంత సంస్కారమూ, సాహసమూ వుండవు. ఒకేవొక పత్రికకు రాస్తూంటాను, బహుశా మీరు చూసేవుంటారు – 'లైంగికి'"

"క్షమించాలి! ఆ పత్రిక చూడలేదు" – అతడు చాలా పెద్దమనిషి అనే ధోరణిలోనే యీ మాటలు అన్నాడు.

కాని – అవును! – నందయ్య కాఫీ హోటల్లోకి చకచకా వెళ్ళి ఖాళీగా వున్న ఓ టేబుల్ ముందు కూర్చుని మధనపడసాగాడు. ఐదు నిమిషాల కిందట జరిగిన సంఘటనే అయినా, ఎందుకనో అతనికి ఆ తరువాత జరిగిన సంభాషణ సరిగా గుర్తుకు రావడం లేదు. బుర్రను బాగా కదిలించి – కుదిపించి, ఆలోచించసాగాడు. అవే మాటలు మక్కికి మక్కి...

"ఏం కావాలి?" – సర్వరు అడిగినప్పుడు, తల వంచుకుని ఆలోచిస్తూనే, "కాఫీ! పాల కంటే డికాక్షన్ ఎక్కువ వుండాలి. ఊఁ" – అన్నాడు.

కాఫీ తాగి బయటకు వచ్చి, కాప్‌స్టన్ సిగరెట్టు వెలిగించి అణిచిపెట్టి పట్టిన రెండు పట్టుల్తో, ఆ జరిగిపోయిన సంభాషణ అసలు స్వరూపంలో బయట పడింది.

'లైంగికి పత్రిక చూడకపోవడం ఏమిటోయ్? వేల సంఖ్యలో నడుస్తోంది. బహుశా లక్షల్లో దిగొచ్చు. మా మిత్రుడు ఏం రాస్తుంటాడో తెలుసా?'

అక్కడ కోటేశ్వర్రావు మాటకు తను అడ్డుపడి జవాబు చెప్పవలసింది కాదు. కానీ... అనేశాడు.

"ఏదో సెక్సు కథలు రాస్తుంటాను"

వాడు – ఆ కామేశ్వర్రావు యిక్కడే అందుకున్నాడు – చురక వేశాడు. కాని, అప్పుడు తను ఆ విధంగా అర్థం చేసుకోలేదు.

"మీ మిత్రుడి ముఖం చూడగానే అనుకున్నాడు – పత్రిక పేరు విన్న తరువాత దృఢపడింది"

అప్పట్లో తనకు ఆ మాటలు పొగడ్తగానే అనిపించినై - మెప్పుకోళ్ళుగానే తోచినై. కాని.....

కొట్టు యింకా ఓఫర్లాంగు వుండనగా ఆగి, మరో సిగరెట్టు తీసి వెలిగించాడు. కొట్టు బయటి అరుగు మీద నిలబడి, షాహుకారూ, తన తోటి గుమాస్తా రామం ఏదో మాట్లాడుతున్నారు.

నందయ్య మరోవైపుకు తలతిప్పి హడావిడిగా, అదుర్దాగా సిగరెట్టు పీల్చడం ప్రారంభించాడు. రచయితగా, సెక్సు కథకుడుగా తనకున్న పేరుకీ, కీర్తికీ - తను ఏ పత్రికాఫీసులోనో సంపాదక హోదాలో వుండి వుండవలసింది. కాని తన రోజులు బావోకో, లేక తెలుగు సాహితీకాంత నోచుకోకో - తను ఆ పాడు గుడ్డల కొట్లో గుడ్డపేలికల్ని అర్ధగజం బద్దతో కొలవవలసిన దుస్థితి పట్టింది. మానవ హృదయాల్నీ, స్త్రీ పురుషుల లైంగికోద్భృతాల్నీ, వాటి అవసరాల్నీ కొలిచి ఖరీదులు కట్టవలసిన తను, అంత నీచంగా, తన తెలివితేటలకీ, సంస్కారానికీ ఏమాత్రం పనికిరాని....

బరువుగా కదిలే భావతరంగాల మధ్య నుంచి బయటపడి, చేతులో మిగిలిన సిగరెట్ ముక్కను దూరంగా పారేసి, నందయ్య తలతిప్పి కొట్టు వైపుకు చూసేసరికి, షాహుకారు గబగబా అరుగు దిగి రిక్షా ఎక్కి వెళ్ళిపోతున్నాడు.

నందయ్య మనస్సు కొంత కుదట పడింది. కోటేశ్వర్రావు స్నేహితుడు కామేశ్వర్రావు అన్న మాటల్లోని మర్మం సూచన ప్రాయంగా తెలిసినట్టుగా తోచింది.

'వుదయం నుంచీ అన్నీ ఆపశకునాలే... అవమానాలే' - అనుకుంటూ నందయ్య కొట్టు వైపుకు వేగంగా నడిచాడు.

కొట్లో అడుగు ఆనించీ ఆనించక ముందే రామం ఎదురై -

"ఛాన్సు కొట్టేశాడురా బ్రదర్! కొట్టేశాడు!" - అన్నాడు.

సెక్సు కథకుడుగా తనకున్న అనుభవంతో నందయ్యకు విషయం యిట్టే ఆకళింపు ఐనట్టు తోచింది. దానికి కర్త పురుషుడూ - కర్మ స్త్రీ ఐవుంటుంది! రామాన్ని ఏమీ ప్రశ్నించకుండా నిబ్బరంగా నడిచి ఓ గుడ్డల బీరువా పక్కన బల్ల మీద కూర్చున్నాడు.

"నీకు అప్పుడే తెలిసిపోయిందా? ఆఁ!" - అన్నాడు రామం.

"ఆ మాత్రం గ్రహింపు లేకపోతే - మనం సెక్కు కథకులం ఎలా అవుతాం? లైంగిక సమస్యల్ని, మనం వేటకుక్కలాంటి చురుకుదనంతో పసికట్టగలం"

రామం ఓ దీర్ఘశ్వాస విడిచి, అతడి పక్క చతికిలపడి, దీర్ఘాలోచనలోవున్న నందయ్య బుజం పట్టుకుని కుదుపుతూ - "నీ లైంగికం-సెక్సు సమస్యలు మండా, మన కొంపారింది!" - అన్నాడు.

"ఎవరిది?" - నందయ్య అనుమానంగా అడిగాడు.

"మన యిద్దరిదీ - కొట్లో వున్న అందరు గుమాస్తాలదీ - ఒక్క స్వాహాగాడిది తప్ప"

"ఏం జరిగింది?"

"స్వాహాగాడు - సరే వాణ్ని యిక ముందు స్వాహారావుగారనే పిలవాలిసుంటుంది - ఎకౌన్‌టెన్ట్ అయ్యాడు"

"ఆఁ! ఎప్పుడు? నిజమా?" - నందయ్య బల్లమీద నిటారుగా కూర్చున్నాడు. ఆ కిందటి రోజే వేయించిన సమ్మర్ క్రాపు నిటారుగా నిక్కపొడిచి సూదుల్లా నిలబడి వాడిగా చూస్తోంది.

"నిజంరా బాబూ! నిజం!"

నందయ్య ఓమారు రామం వంక ప్రశ్నార్థకంగా చూసి -

"అయితే యిందులో ప్రధాన పాత్ర ఓ స్త్రీదై వుంటుంది. అవునా?" - అన్నాడు.

రామం ఆ మాటతో ఎగిరి బల్ల మీద నిలబడి, "హ్విప్! హ్విప్! లైంగికేయా! హుర్రా!" - అన్నాడు.

"అసలు విషయం చెప్పు! ఎవరా స్త్రీ?" - నందయ్య చిరునవ్వుతో ప్రశ్నించి, కళ్లు పెద్దవి చేశాడు.

"ఎవరో యిప్పుడే చెప్తాను. కాని ఏం లాభం? చేజారిపోయింది. నాకు భార్యలేక వుపయోగించ లేదు. నువ్వు భార్య వుండి కూడా తటపటాయించావు. స్వాహాగాడు తన్నేసుకుపోయాడు"

"వాడి భార్యేనా? ఏం జరిగింది?"

"జరిగేందుకు పెద్దగా ఏమీ లేదు. వాడు, 'ఓహెన్రీ' కథల మీద చూపే అభివృద్ధే యిక్కడా చూపాడు. పోతే 'మొపాసా'ను మధ్యలో నుంచి ప్రారంభించడం జరిగింది. కాని పూర్వంలాగా ఏతోటి తెలుగవాడి కథనో సొంత పేరుతో అచ్చేయించుకోలేదు గనకా - వాళ్లు యీ ఖండ వాసులు కాదు గనకా, యీసారి క్షమాపణ రాసి యివ్వాలిసిన అవసరం వుండదు"

"అయితే అంతా వట్టికథే అన్నమాట! వాడు నా దగ్గిర నుంచి యిప్పుడిప్పుడే సెక్సు కథలు రాయడం నేర్చుకుంటున్నాడు. అప్పుడే గురువును మించలేదు. మా ఆవిణ్ని వుపయోగించాలనే దాన్ని పూర్తిగా నేను మరిచిపోలేదు. దానిలో అంతగా సెక్స్ అప్పీలు లేదు. అదే చూస్తున్నా"

రామం బల్లదిగి నందయ్య భుజం మీద చేయి వేసి, అతని ముఖంలోకి జాలిగా, సానుభూతిగా చూశాడు, వీపు తడుతూ అన్నాడు.

"యిది కథ కాదు, నిజంగానే జరిగింది. నువ్వు మీ ఆవిణ్ని వుపయోగించే సంగతి యింకా ఆలోచిస్తున్నావ్. స్వాహాగాడు వుపయోగించేశాడు. వాడు యివ్వాళ నుంచి హెడ్ ఎకౌన్‌టెన్ట్!"

"నిజమా! అయితే ఏం చేశాడు? ఊఁ! త్వరగా!" - నందయ్య ఆదుర్దాగా అడిగాడు.

"యిది యదార్థమైనా కథగానే కనబడుతుంది. స్వాహాగాడు నిన్న రాత్రి వూళ్లో లేకుండా పోయాడు. వాడి భార్య వాళ్ల వూరు నుంచి రాత్రి పది గంటల మెయిలుకు దిగి - యింత టౌన్‌లో వెతుక్కుంటూ దారి తప్పినా, గురీగా పోయి షాహుకారుగారి యింటి తలుపు తట్టింది. తలుపు తెరుచుకుంది. తెల్లవారి స్వాహాగాడు గ్రామాంతరం నుంచి వచ్చి, సరాసరి సూర్యనారాయణ కూర్చునే కుర్చీలో కెళ్లి కూర్చున్నాడు. సూర్యనారాయణ ఓ అరగంట తరవాత వచ్చి, లేవమన్నాడు. దానికి స్వాహాగాడి జవాబేమిటో తెలుసా? లేవను. కాని - యిక ముందు ఎలాంటి అవసరాల్లో ఐనా గౌరవంగా పిలవాలసి వుంటుంది.......!"

"నీ మాటకు అడ్డొస్తున్నాను. యిదంతా నిజంగా జరిగిందేనా?" - నందయ్య వూపిరి బిగపట్టి,

గుడ్లు తేలవేస్తూ అడిగాడు.

"నిజంగా జరిగిందే! అయిపోవచ్చింది విను! సూర్యనారాయణ రొప్పుకుంటూ షాహుకారు గారింటికి వెళ్లాడు. ఆయన లేడు. ఎవరో కొత్త స్త్రీమూర్తి ప్రత్యక్షమైంది. ఆమెను అడిగాడు - 'షాహుకారు గారెక్కడ?' - అని. ఆమె జవాబేమిటో తెలుసా?"

"కానీ - ఊఁ! నువ్వే చెప్పు"

"యిప్పుడే బయటికి వెళ్లారు. హు! కాదు. బయటకు పంపాను. తొమ్మిదీ పదిహేను నిమిషాలకు వస్తారు అని"

"హుఁ! తరువాత?"

"తరవాత ఎక్కువేమీ లేదు. సూర్యనారాయణ అక్కడే రాజీనామా కాయితం రాసి ఆమెకే యిచ్చి వెళ్ళిపోయాడు. యిదీ కథ! చూశావా ఎంత మోసమో?"

నందయ్య గవదల్ని అరిచేతుల్తో గట్టిగా అదిమిపట్టుకొని నేల వంక చూస్తూ -

"మోసం కాదు! మానవ జీవితం మీద సెక్సుకున్న పట్టు, ప్రభావం వెల్లడవుతోంది! వుదయం నుంచీ మనస్సు చికాకుగా వుంది. అన్నీ అపశకునాలే..... అవమా...."

నందయ్య ఓ తెల్లకాగితం మీద ఏదో గబగబా రాసి రామం చేతి కిచ్చాడు.

"యివ్వాళ సెలవు కావాలి. ఆ చీటీ ఎకౌన్‌టెన్ట్‌గారికివ్వు"

ఏదో ప్రశ్నించబోయిన రామాన్ని ముఖం చిట్లింపుతో ఆపి, నందయ్య గబగబా మెట్లు దిగి రోడ్డు మీది కొచ్చాడు.

అతను రోడ్డుకు ఓ పక్కగా ఒదిగి ఒదిగి నడవ నారంభించాడు. జీవితంలో తను కట్టుకున్న ఒకే ఒక ఆశాసౌధం కూలిపోయింది. ఆ కూలడం కూడా తన మీదే - చాలా బరువుగా, భారంగా....

రచయితగా తనకున్న పేరుతో - తను ఏ పత్రికా కార్యాలయంలోనో వుద్యోగం చేస్తూ వుండ వలసింది. కాని తన ఆశలకీ, ఆశయాలకీ ఏమాత్రం అనుకూలంగాని - ఆ గుడ్డల కొట్లో పాడు గుమాస్తాగిరితో, బండచాకిరీ చేయక తప్పలేదు. అయినా - తను ఆ చెడులోంచే మంచిని గుంజు కునేందుకు ప్రయత్నిస్తున్నాడు. కాని - ఆ స్వాహారావు - వాడు, పెద్దదెబ్బ, ఆ దెబ్బ కూడా చాలా బలంగానే కొట్టాడు.

షావుకారులో వున్న బలహీనతల్ని యిట్టే కనిపెట్టిన తను - ఏ కారణంవల్ల సదుపయోగం చేసుకోలేకపోయాడు?

ఈ ప్రశ్న బలంగా, తీవ్రంగా ఎదుర్కోగానే, నందయ్య సరాసరి పక్కన వున్న కాఫీ హోటల్లో జొరపడ్డాడు.

కుర్చీకి చేరగిలపడి, ఓ గుక్కెడు కషాయంలాంటి కాఫీ గొంతులోకి జార్చగానే అతని కళ్ల ముందు - ఆ ప్రశ్న దాని పరిష్కారం తళుక్కుమన్నట్టయింది.

"జలసీ! జలసీ! జలసీ!"

నందయ్య యీ మాటల్ని కొంచెం బిగ్గరగానే అన్నాడు.

సర్వరు కొంత హడావిడిగానే వచ్చి, బిల్లు టేబిల్ మీద పెట్టి వెళ్ళిపోయాడు.

"గురువా! నేను నీ శిష్యత్వానికి తగను! జలసీ...జలసీ....అదే నా జీవితంలో వొచ్చిన ఒకేఒక సదవకాశాన్ని దుర్వినియోగ పరిచింది. స్వాహారావు యీ కొట్లో వుద్యోగంలో చేరకముందే – నేను ఆ పని చేద్దామనుకున్నాను. కాని నా వెనక వొచ్చినవాడు – నా కంటె ముందుగా భార్యను...."

తక్కిన మాటలు అతని గొంతు వరకూ రాకుండా, గుండెల్లోనే హరించిపోయినై.

నందయ్య తిరిగి రోడ్డు మీదికి వచ్చాడు.

వుదయం లేచిన దగ్గర నుంచీ ఎదురౌతున్న అపశకునాల్లో గురువుగారి కూతురు సంగతి వొహటి. రెండు తన భార్య నడుం వలయాన్ని పెంచుకుంటోందని తల్లి కబురు.... యింకా....యింకా....

దుఃఖాన్ని ఎప్పటికప్పుడు దిగమింగుతూ నందయ్య రూముకు చేరాడు. తనెంత మనోలైంగిక, వినోద కథారచయిత ఐనా, తను చూడలేని సత్యాలు అనేకం వున్నట్టు అతనికి తోచింది.

తన షాహుకారుకు మగవాళ్లను చూస్తే సిగ్గనీ, ఆడవాళ్లను చూస్తే భయమనీ తనకు తెలుసు! కాని తను పొరపడింది ఎక్కడంటే – అలాంటి వాళ్లను ఏ పురుషుడైనా యిట్టే లొంగతీసుకో గలడనీ, ఎలాంటి స్త్రీ ఐనా యిట్టే లోబరుచుకోగలదనీ గ్రహించలేక పోవడం! రెండోది తనలో యింకా సొంతంగా వదలని 'జలసీ'.

తన భార్య మొదటి ముద్దునీ... ఆ తొలి అనుభవాన్నీ తనే పొందాలనీ, అది మరెవరిదీ కారాదనీ – ఎందుకో తన మనసులో ఆరాటం జరుగుతూనే వుంటుంది. అదే, తన గురువుగారు నిరసించే జలసీ! తనూ – యింతవరకు అచ్చయిన తన కథల్లో దాన్ని బాగా హేళన చేశాడు. ముఖ్యంగా 'లైంగికి'లో అచ్చయి ప్రాసిక్యూషన్ వొచ్చిపడ్డ 'కన్నెపొర', 'ఆలిచిప్పలు' అన్న చిన్న కథల్లోనూ, రేడియోకని పంపితే తిరుగుటపాలో తిరిగివొచ్చిన 'తొడపాము' అన్న ఏకాంకికలోనూ – మగవాడిలోని – అస్వార్థాన్నీ, నీచత్వాన్నీ ఎంతగానో తను తూర్పార పట్టాడు. కాని, తన స్వవిషయంలో – తన భార్య విషయంలో...హా! గురూ! నేను నీ శిష్యుణ్ణని చెప్పుకో తగను! నిజం గురూ!

నందయ్య ఓ ఐదు నిమిషాలు వెక్కి వెక్కి ఏడ్చాడు. మరో పది నిమిషాలు భోరుమని గోలెత్తాడు.

'మనో లైంగిక విషయాల్లో నాకు ఏమాత్రం సాటిరాని స్వాహారావు, భార్యని ప్రమోషన్ కోసం అంత చక్కగా వుపయోగించుకుని ఎకౌన్‌టెంట్ ఐపొయ్యాడు కాని... నేను.... నేను...'

పొర్లివచ్చే దుఃఖాన్ని దుప్పటి గుడ్డతో తుడుచుకుని నందయ్య లేచి నిలబడ్డాడు. ఎదురుగా పుస్తకాల బీరువా మీదికి అతడి దృష్టిపోయింది. బరువైన గుండెతో, అతడు బీరువా తలుపు లాగి గురువుగారు రాసిన 'జలసీ' అన్న పుస్తకం బయటకు తీశాడు.

మంచం మీద కూర్చుని పుస్తకం మధ్యకు తెరిచాడు.

అతని హృదయం చలించింది. ఎదురుగా అమోఘ వచనాలు!

"జలసీ అన్నది మానవుణ్ని, పశుపక్ష్యాదుల నుంచి వేరుచేస్తోందని నాకు తెలుసు. తను కన్న కూతుర్ని పరాయి పురుషుడు ఎత్తుకొని ముద్దాడుతుంటే సంతోషిస్తాడు – వీలైతే చప్పట్లు చరుస్తాడు. కాని ఎవరో కన్నకూతురు తనకు భార్యగా వచ్చినంత మాత్రాన – అలాంటి ముద్దునే మరో పురుషుడు కాంక్షిస్తే కొడతాడు – వీలైతే చంపుతాడు"

నందయ్య కళ్లు ఆ వాక్యాలు చదివి చమ్మగిల్లినై. అతడు గుండెల మీద చేయి వేసుకుని కప్పు వంక చూస్తూ, 'గురూ! నువ్వు యీ లోకంలో పుట్టవలసింది కాదు. పుట్టినా – యీపాడు దేశానికి సాహిత్యభిక్ష పెట్టవలసింది కాదు' అన్నాడు.

అతను తిరిగి పుస్తకాన్ని బీరువాలో పెట్టబోయేముందు మరోసారి తెరిచి చూశాడు.

అక్కడ కనిపించిన వాక్యాల్ని బిగ్గరగా చదివాడు –

'ప్రేమ వేలు పెట్టలేని స్థలాల్లో, ధనం తలకాయ దూర్చగలుగుతుంది'

'చాలామంది నీచులు అడుగుతున్నట్లు యీనాడు దేశానికి కావలసింది రాజకీయ స్వాతంత్ర్యమూ కాదు – ఆర్థిక స్వాతంత్ర్యమూ కాదు. పశుపక్ష్యాదుల్లా, తిరిగి ప్రకృతిలో కలిసిబతకనేర్చిన నూతన విజ్ఞానం. లైంగిక స్వేచ్ఛ! భరతమాత లైంగిక శృంఖలాలు ఎప్పుడు విడుతవో కదా!'

నందయ్య పుస్తకాన్ని బీరువాలో పెట్టకుండానే తలుపు వేశాడు. అతని హృదయంలో అనేక భావాలు అటూ ఇటూ ప్రయాణించినై. గత రెండు మూడు సంవత్సరాల జీవితం కళ్ల ముందు కదుల్లాడింది. తను సెక్సు కథలు రాసేందుకు అనుభవం అవసరమని, పావలా ఖర్చుచేసి తెచ్చుకున్న 'కరిమేహం' – దానికి మాత్రల రూపంలో ఆచారిగారు వసూలు చేసిన రూపాయిలూ, దాన్నే 'సిఫ్లిస్' అన్న పేరుతో సిబజాల్ బిళ్లలకూ, పెన్‌సిలిన్ యింజక్షన్‌లకూ డాక్టరుగారు పుచ్చుకున్న నోట్లూ అన్నీ నేత్రాల ముందు నృత్యం చేసినై.

తన శరీరం యింత రోగగ్రస్థమైనా తనకున్న లైంగిక జ్ఞానమెంత ? మూడు పావలాల ఖర్చుతో రెండుసార్లు గుడిశెల్లో దూరి గడిపిన కొద్ది కాలమూ, మేదర తడిక పుణ్యాన పక్క గదిలోని దంపతులు తనకు అప్పుడప్పుడూ అవకాశం కలిగించే ప్రేక్షక స్థానమూను!

నందయ్యకు యీ ఆలోచనలు కలిగినకొద్దీ, దేహం మీద తేళ్లూ, జెర్రులూ పాకటం అధికమైంది. అతను కోపంగా వొళ్లు రుద్దుకుంటూ, 'ఆ ముండను తీసుకెళ్లేందుకు వాళ్లు వొప్పుకున్నట్టయితే – యీ కరిమేహం – కాదు సిఫ్లిస్‌తో బాధపడే అవస్థ పట్టేది కాదు. స్వాహోగాడికన్న నేనే ముందు దాన్ని వుపయోగించి ఎకౌంటెంటు ఛాన్సు కొట్టేవాణ్ని...యిప్పటికైనా.... యిప్పుడేముంది...అంతా చేజారిపోయింది. యిక... ఆ మొదటి ముద్దూ...ఆ ప్రథమానుభవం...చేజారిపోనీను...'

నందయ్య గొణుగుతూనే తలుపు తెరిచాడు. గొళ్లెం పెట్టి తాళం వేశాడు. టిక్కెట్ కొని రైల్లో కూడా అలాగే ఎక్కాడు. రైలు దిగి అత్తగారి యింటి తలుపు తట్టినప్పుడూ అదే మననం చేస్తున్నాడు. కాని...అత్త తలుపు తెరిచి – అల్లుడు లోనికి వచ్చేందుకు పక్కకు తప్పుకున్నప్పుడు మాత్రం – ఏదో చెప్పరాని అనుమానం – ఆవేదనా అతనికి కలిగింది.

"అమ్మాయికి వొంట్లో బాగోలేదు. మీ మామగారు బజారు వెళ్ళారు. కూర్చో యిప్పుడే వస్తారు?"

అత్త యీ మాట చెప్పేప్పుడు ఏవగింపుగా తన వంక చూడ్డాన్ని నందయ్య గమనించాడు.

ఆమె తొందర తొందరగా దొడ్డితలుపు తీసుకుని అవతలి కెళ్ళినప్పుడు 'బహుశా దోక్కునేందు కేమో' అని అతనికి అనుమానం కలిగింది!

దొడ్డివాకిలి వేపు ఓమారు చూసి నందయ్య అక్కడే వున్న నులక మంచం మీద కూలబడ్డాడు. 'అమ్మ రాసింది నిజమే కావొచ్చు' - అనుకుంటూ ఆలోచనలోకి జారుకున్నాడు.

అతడి ఆలోచనలూ, అనుమానాలూ అనేక మార్గాలా అనేక విధాలా గజిబిజిగా, అల్లుకుపోసాగినై. స్వాహారావు తన మీద పొందిన విజయమూ, సిబజాల్ బిళ్ళా, తన భార్య - సుగుణమణి సింహ మధ్యం రోడ్డు రోలరంత లావెక్కడం. కామేశ్వర్రావు అన్న వ్యంగ్య వచనాలూ, తన మొహాన్ని క్రమక్రమంగా అల్లుకుపోతున్న కరిమేహపు నిగనిగలాడే నల్లదనమూ, గురువుగారూ, తను రాయదలచుకున్న కథకు, 'అవ్వలి' నవలల్లో నుంచి తీసుకున్న ప్లాటూ - అన్నీ యింకా అనేకం, నందయ్య బుర్రలో నాట్యం చేయసాగినై.

'కాయితాలు దగ్గిర లేవు, లేకపోతే ఏ మనోలైంగిక కథో- అత్యంత వాస్తవిక కథో రాద్దును'

బుర్రలో కదిలిన యీ ఆలోచనని, గొంతులో గొణుక్కుంటూ అతను చుట్టూ చూశాడు. ఎదురుగావున్న గోడ నుంచి ఓ లాల్చీ వేలాడుతోంది. నందయ్య ప్రాణి గిజగిజ లాడింది. మామ లాల్చీ కాదు కదా - అసలు చొక్కాలే తొడగడు. మరి...ఆ లాల్చీ ఎవరిదైవుంటుంది?

తల్లి చేసిన కబురూ. వుత్తరంలోని సంగతులూ, అతని మనసులో మెదుల్లాడినై. ఆ మొదటి ముద్దూ - ఆ ప్రథమానుభవం ఎవడైనా గుంజేసుకున్నాడా? తనకు దక్కకుండా ఎన్నడో మింగి, జీర్ణించుక్కూచున్నాడా? యింతకీ తన భార్య ఎక్కడున్నట్టు?

నందయ్య హృదయంలో గురువుగారి 'జలసీ' గ్రంథపు పుటలన్నీ రెపరెప లాడినై. కాని వాటిని తొలగదోస్తూ, ఏదో సన్నగా, పదునుగా హృదయాన్ని కాల్చేమంటా, తను జీవితంలో ఒక్కసారి మాత్రమే - అనుభవించి, జీవితాంతవరకూ నెమరువేసుకోదగినంత ఆనందం, ఆహ్లాదం - యిట్టే జారిపోయిందే అనే బాధా, వుబికి వుబికి వుబికి ఒకసారి అన్ని వ్యతిరేక శక్తుల్నీ లొంగదీసినై.

ఎన్నో కుక్కల్తో కావర్లాడి, కాట్లు తిని - బలవంతంగా వూడబెరికి తెచ్చుకున్న బొమికని కాస్తా - తీరా కోరల కింద వుంచి కొరకబోయే సమయానికి 'ఓ వొంటరి కుక్క దొంగచాటుగా వూడబెరక్కు పోయినప్పుడు' - అంత బాధా పడ్డ కుక్క మొహంలో కనబడే క్రోధం, నిస్సహాయతా, వుద్రేకం నందయ్య మొహంలో ప్రస్ఫుటమైంది.

అతడు మంచం మీద నుంచి లేచి పక్కగా వున్న గది తలుపు నెమ్మదిగా నెట్టాడు. అతని గుండెలు గతుక్కుమన్నయ్.

ఎదురుగా భార్య సుగుణమణి పాలిపోయిన మొహంతో, నీరసంగా మంచంలో నుంచి, శూన్యంగా చూడడం కనబడింది.

తడబడే కాళ్లతో నందయ్య ఆమె మంచం సమీపించాడు. ఒక్క తృటిలో తన తల్లి రాసిందంతా అబద్ధమని అతనికి నిశ్చయమైంది. భార్య నడుం వలయం పెరగలేదు సరికదా - మూడు సంవత్సరాల నాడు పెళ్లిలో తను పోల్చుకుని, వూహించిన సింహ మధ్యపు దశ నుంచి, భ్రమర మధ్యపు దశకు మారింది.

'ఫ్రాయిడ్ నిజంగా మా గురువుతో పోల్చదగ్గవాడు. తన కుమారుడి ప్రేమలో భాగం పంచుకుంటుందన్న ద్వేషమే ప్రతి అత్తనూ, కోడలినీ హింసించే భూతంలా తయారు చేస్తోంది. అతనన్నట్లు - జీవకోటి అంతా - సెక్సు వాయువుల్లో చిందర వందరగా కొట్టుకుపోయే చెత్తపరకలు -'

నందయ్య ఆలోచిస్తూ అలాగే నిలబడిపోయాడు.

"అలా చూస్తారేం? దగ్గరికి రండి!" అన్న సుగుణమణి సన్నని కంఠ ధ్వని అతని తల మీద తట్టి లేపింది.

"మణీ! నిన్ను గురించి నేను చాలా అనుమానపడ్డాను. క్షమించు! క్షమించు!"

నందయ్య కళ్లవెంట కారే నీళ్లతో మంచం పక్కగా వంగి జాలిగా భార్య కళ్లలోకి చూశాడు.

"నా నందం! నిన్ను క్షమించేందుకేముంది? మూడు నెలల తేడాతో పురిటి బాధ తప్పించుకున్నాను. నీ మనోలైంగిక కథలు నాకు ప్రోత్సాహాన్నీ, ధైర్యాన్నీ కలిగించినై. ఆ కొద్దిపాటి కార్యానికి అంత దూరాన వున్న నిన్ను బాధపెట్టదల్చుకోలేదు. మన యిద్దరం 'జలసీ'ని జయించాం"

"అంటే! నువ్వు....నువ్వు... మరో...."

పాలిపోయిన సుగుణమణి ముఖంలో కొత్త నెత్తురు ప్రవహించింది.

"బాగా వూహించావ్ నందు! నీకు మనోలైంగిక కథకుడుగా గొప్ప భవిష్యత్తు వుంది. నేను కూడా అనుభవం గడించాను గనక - నీకు అన్నివిధాలా సహాయం చేయగలను. మనిద్దరినీ కలిపేందుకు పెద్దవాళ్లు ముహూర్తాలు నిర్ణయించనవసరంలేదు. కాస్త కులాసా చిక్కగానే వెళ్లిపోదాం"

"కాని..... నేను... యిలా... యిలా...." - నందయ్య మాట పెగలక వుక్కిరి బిక్కిరయ్యాడు.

సుగుణమణి ధైర్యం చెప్పే ధోరణిలో అంది.

"ఆరోగ్యం బాగోలేదా? మొహాన ఆ మచ్చలేంటి? గులాబీలు కోసే ప్రయత్నంలో గుచ్చుకున్న ముల్లా? ఫరవాలేదు. ఎంతో వ్యాధి ముదిరిన నాకే ఇరవై లక్షల పెన్సిలిన్‌తో వుపశమనం కలిగింది. నీకు అంత పెన్సిలిన్ అవసరం లేదనుకుంటాను. అయినా డాక్టరుతో మాట్లాడదాం"

నందయ్య సంతత ధారగా కారే కళ్ల నీళ్లను గమనించలేదు. నిలువు గుడ్లతో భార్య ముఖంలోకి చూస్తూ - అలాగే వుండిపోయాడు.

సుగుణమణి ఓ నిమిషం అతని వంక జాలిగా చూసి. చిరునవ్వుతో, చేతిని చాచి - అందీ అందని నందయ్య జుట్టును వేళ్లలో యిరికించుకుని తన వైపుకు లాక్కుంది.

నందయ్య చెత్తపరకలా, ఆమె వేళ్ల మధ్య యిరుక్కుపోయాడు.

❋

*(అభిసారిక మాసపత్రిక : ఏప్రిల్, 1950)*